క్లుప్తంగా

బోధన అభ్యసన సామగ్రి ప్రదర్శన



గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభించిన శిక్షా సప్తాహ్‌లో భాగంగా చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన అభ్యసన సామగ్రిని ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ స్థానికంగా దొరికే లోకాస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన బోధన అభ్యసన సామగ్రి ఎంతో ఆకర్షణంగా ఉందన్నారు. విద్యార్థులందరూ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో బోధన అభ్యసన సామగ్రిని తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలోని రోజువారీ కార్యక్రమాలను వారం రోజుల పాటు నిర్వహించాలని కోరారు.

అంజుమన్-ఇ-ఇస్లామియా కమిటీ ఎన్నికలు నిర్వహించాలి

లక్ష్మీపురం: గుంటూరు అంజుమన్-ఇ-ఇస్లామియా వక్ఫ్ సంస్థకు సంబంధించి బై లా ప్రకారం ఎన్నికలు నిర్వహించకుండా శాసన సభ్యులు ఇచ్చిన సిఫార్సు లేఖలతో రాష్ట్ర వక్ఫ్ బోర్డు మేనేజ్‌మెంట్ కమిటీలను ఎంపిక చేస్తున్నారని రాష్ట్ర ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి సంఘ అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తికి లేఖను రాశారు. గతంలో వక్ఫ్ బోర్డుకు సంబంధించిన బైలాస్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, వక్ఫ్‌బోర్డు సీఈఓ, జిల్లా కలెక్టర్‌కు కోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కాని ఇంత వరకు వాటిని సంబంధింత అధికారులు అమలు చేయలేదని ఆరోపించారు. అంజుమన్-ఇ-ఇస్లామియా సంస్థలో ఎన్నికలు నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తికి లేఖ రాసినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి న్యాయం చేయాలి



లక్ష్మీపురం: రాబోయే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి న్యాయం చేయాలని, రాజధానికి పోలవరానికి నిధులు కేటాయించాలని, ప్రత్యేక హోదాపై సానుకూలంగా స్పందించాలని రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం కేంద్ర బడ్జెట్‌పై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంత కాలంగా ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం పూర్తి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందని, ఇప్పుడు మారిన రాజకీయ పరిస్థితులలో పదేళ్ల విభజిత ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లుకురిపిస్తారనే ఆశతో రాష్ట్ర ప్రజలు ఉన్నారన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఇంత కాలం విభజన చట్టంలో భాగంగా ఏపీకి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం తదితరాలకు కేంద్రమే బాధ్యత వహించాలన్నారు. పోలవరం ముంపు ప్రాంతాలకు పునరావస ప్యాకేజీ ఇవ్వలేదని, రైల్వే ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చూపారని అన్ని బడ్జెట్‌లలోనూ విసిరేసినట్లుగా రాష్ట్రానికి కేంద్రం నిధులు కేటాయించిందన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డితోట 3వలైనులో నివాసం ఉండే సీరంశెట్టి దుర్గాప్రసాద్(35) అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో సోమవారం ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 27న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ వైబ్ సైట్‌లో గానీ, తెనాలి, గుంటూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. 24వ తేదీ లోపు తమ సర్టిఫికెట్లను నమోదు కేంద్రాల్లో వెరిఫై చేయించుకోవాలన్నారు. 27వ తేదీ ఉదయం 9 గంటకు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పారు. ప్రైవేట్ కళాశాలల్లో చేరదలచిన వారు 29, 30 తేదీలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని వివరించారు. వివరాలకు 93477 95839, 63045 72793 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైభవంగా అష్టోత్తర శతకలశ స్నపన మహోత్సవం



కలశాలతో ప్రదర్శనగా వస్తున్న భక్తులు



హాజరైన భక్తులు

నగరంపాలెం: ఆషాఢమాస శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని సోమవారం బృందావన్‌గార్డెన్స్‌లో వేంచేసిన పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామికి 108 కలశాలతో అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు మాధవస్వామి మాట్లాడుతూ స్నపన(అభిషేక) వైభవాన్ని గురించి విమానార్చన కల్పంలో విఖానస మహర్షి అద్భుతంగా అందించారని అన్నారు. అందరూ ఐదు కలశాలతో, తొమ్మిది కలశాలతో, పద్నాలుగు కలశాలతో చేస్తారని పేర్కొన్నారు. అయితే 108 కలశాలతో చేసే స్నపన ఉత్తమమైనది అని మహర్షి ప్రస్తావిస్తారని అన్నారు. నిక్షిప్త ద్రవ్యాల ప్రభావం వివరిస్తూ సర్వపాపవిశుద్ధాత్మ సర్వపాపాలు తొలగి, భవిష్యత్‌లో మహరాజు అవుతారని మహర్షి అన్నారని తెలిపారు. ఆనంద నిలయుని అభిషేకంలో భాగస్వాములై తరించాలని కోరారు. అనేక ద్రవ్యాలతో జరిగే ఈ అభిషేక తీర్థం స్వీకరించిన వారికి శరీర రుగ్మతలన్నీ తొలగిపోయి, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలుగుతాయని అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, దేవాలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్.మస్తావయ్య, సహాయ కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

బుడంపాడు హై లెవల్ చానల్ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, కొల్లి రంగారెడ్డి

లక్ష్మీపురం: గుంటూరు జిల్లాలోని అనేక గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందించే గుంటూరు హై లెవల్ చానల్ మరమ్మతులు తక్షణమే చేయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుడంపాడు వద్ద హై లెవల్ కాలువను సీపీఐ, రైతు సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ, ప్రకాశం బ్యారేజీ నుంచి గుంటూరు జిల్లాకు తాగునీరు, సాగునీరు అందించే 47 కిలోమీటర్ల ప్రధాన కాలువ పాలకుల నిర్లక్ష్యానికి గురై నరకకూపాన్ని తలపిస్తోందని చెప్పారు. ఈ కాలువ ద్వారా మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు సంబంధించి పదివేల ఎకరాల మెట్ట, 20 వేల ఎకరాల మాగాణికి నీరు అందుతుందని వివరించారు. మంగళగిరి, గుంటూరు, కార్పొరేషన్లతో పాటు 30 గ్రామాల ప్రజలు తాగునీటి అవసరాలకు వాడుతున్నారని గుర్తు చేశారు. ఈ కాలువపై ఉన్న చాప్టలు, బలహీనపడి పగుళ్లు ఏర్పడడంతో గుంటూరుతో పాటు ఉండవల్లి, తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని తదితర ప్రాంతాల నుంచి మురుగు నీరు ఈ కాలువలో కలుస్తున్నదని తెలిపారు. కాలువలో కలవకుండా ఈ కాలువపై ఉన్న చప్టాలకు మరమ్మతులు చేసి మురుగునీరు కాలువలో కలవకుండా తగిన చర్యలు తీసుకోని అనేక గ్రామాల ప్రజలకు గత జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులకు అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందన్నారు. దీనితో పాటు గుర్రపు డెక్క, తూటాకు ప్లాస్టిక్ వ్యర్థాతో కాలువ నిండి పోయి ప్రజా ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కాలువ కట్టలపై గండ్లు పడితే పంటలకు ఎంతో నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఏటా నిధులు తగిన విధంగా కేటాయించక, కేటాయించిన నిధులను కూడా సక్రమంగా వినియోగించక పనులను ఆలస్యంగా ప్రారంభించడంతో వర్షాలు వచ్చి పనులు నిలిపి వేయడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది అయినా ఈ కాలువ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి, వ్యర్థాలను తొలిగించడంతో పాటు కాలువ గట్లపై పెరిగిన తుమ్మ తదితర మొక్కలను తొలిగించి, కాలువలపై ఉన్న చప్టాలకు మరమ్మతులు చేయక పోవడం వల్ల మురుగునీరు మంగళగిరి, డ్రైనేజీలో కలిసి ఈ నీరు కలుషితమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ పాల్గొన్నారు.

లోకానికి వేదాలను అందించిన వ్యాసభగవానుడు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏడు కోట్ల మంత్రాలను నాలుగు వేదాలుగా విభజించిన వ్యాస భగవానుడు వేదవ్యాసునిగా అవతరించారని టీజేపీఎస్ కళాశాల విశ్రాంత తెలుగు ఆచార్యులు డాక్టర్ జి.వైదేహి అన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సోమవారం సంస్కృత విభాగ ఆధ్వర్యంలో వ్యాస పూర్ణిమ నిర్వహించారు. వైదేహి మాట్లాడుతూ కాలం గడిచే కొద్దీ మానవుని బుద్ధిశక్తి క్షీణిస్తోందని, అందుకు అనుగుణంగానే బ్రహ్మసూత్రాలు, అష్టాదశ పురాణాలను రచించి వేదసారాన్ని మహా భారతంగా అందించాడని పేర్కొన్నారు. టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ ఆషాఢమాసంలో వచ్చే గురు పూర్ణిమను వ్యాసపూర్ణిమ అని పిలుస్తారని, లోకానికి జ్ఞానభిక్ష పెట్టిన వ్యాసుడు జన్మించిన రోజు అని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, సంస్కృత విభాగాధిపతి డాక్టర్ పి.దేవేంద్ర గుప్తా, డాక్టర్ ఎ.అంజనీ కుమార్, ఆర్.జయశైలజ పాల్గొన్నారు.

రాష్ట్రంలో హత్యలు, లైంగిక దాడుల ప్రస్తావన లేకపోవడం విడ్డూరం

లక్ష్మీపురం: అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో రాష్ట్రంలో వరస హత్యలతో పాటు లైంగిక దాడుల ప్రస్తావన లేకపోవడం సరైన వైఖరి కాదని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు(సంగమ్) సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 21వ తేదీన స్వయంగా గవర్నర్‌కు రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయని చేసిన ఫిర్యాదుపై గవర్నర్‌కు చర్యలు తీసుకోవాలని కోరారు.

టీచ్ టూల్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

తెనాలిఅర్బన్: టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమ రాష్ట్ర పరిశీలకులు శారద, అఖిల్, మేరీలు పేర్కొన్నారు. కొత్తపేటలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధనలో ఉపాధ్యాయులకు సహకారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. బోధనలోని మెళుకువలను శిక్షణలో తెలియజేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో పలువురు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ముగ్గురిలో ఒకరికి నరాల సమస్యలు

- అవగాహనతో మెదడు సమస్యలు నివారించవచ్చు
- సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ



గుంటూరు మెడికల్: ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ముగ్గురిలో ఒకరు వారి జీవితకాలంలో నరాల సంబంధిత జబ్బుల బారిన పడే అవకాశం ఉందని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా సోమవారం స్థానిక కొత్తపేటలోని లలితా హాస్పిటల్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా వైకల్యానికి నాడి సంబంధిత జబ్బులే ప్రధాన కారణమని పేర్కొన్నారు. 80 శాతంకు పైగా నాడి సంబంధిత ప్రమాణాలు, వైకల్యాలు న్యూరో స్పెషలిస్టుల సంరక్షణ, వనరులు తక్కువగా ఉన్న దిగువ మధ్యతరగతి దేశాల్లో సంభవిస్తున్నాయని చెప్పారు. అభివృద్ధి చెందతున్న దేశాల్లో ప్రతి పది లక్షల మందికి ఒక న్యూరాలజిస్టు, కోటి మందికి ముగ్గురు న్యూరో సర్జన్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు.

మన దేశంలో నరాల సంబంధిత జబ్బుల్లో 42.2 శాతం బ్రెయిన్ స్ట్రోక్‌లు, 16.3 శాతం మైగ్రేన్, 10.4 శాతం డిమెన్షియా, 7.9 శాతం మెనింజైటీస్, ఐదు శాతం ఎపిలెప్సి, పార్కిన్సన్, డయాబెటిక్ న్యూరోపతి, నాడీ వ్యవస్థ క్యాన్సర్‌లని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన శైలితో 90 శాతం బ్రెయిన్ స్ట్రోక్‌లు, 40 శాతం డిమెన్షియా కేసులు, 25 శాతం ఎపిలెప్సిలను నివారించవచ్చు అన్నారు. మెదడులో న్యూరాన్లు అని పిలువబడే వంద బిలియన్ కణాలు ఉంటాయని, మిలియన్ల కొద్ది విద్యుత్ తీగలతో ఆక్సాన్స్ అని పిలువబడే న్యూరాన్‌ల మధ్య పది ట్రిలియన్ కనెక్షన్లు ఉంటాయన్నారు. ఇవి మనం చదవడానికి, రాయడానికి, ఆలోచించడానికి, చూడడానికి, తెలుసుకోవడానికి, అనుభూతి చెందడానికి సహాయ పడతాయన్నారు. మెదడు సమస్యల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం ముఖ్యంగా పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులతో కూడిన ఆహారం తీసుకోవాలని చెప్పారు. ప్రతిరోజూ 30 నిమిషాల పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా మెదడుకు రక్త ప్రసరణ పెరిగి కొత్త మెదడు కణాల పెరుగుదలను ప్రోత్సహిస్తుందన్నారు. ధ్యానం, యోగ వంటివి చేయడం ద్వారా ఒత్తిడి జయించవచ్చని, మెదడును దెబ్బతీసే కారకాల్లో ఒత్తిడి ఒకటని పేర్కొన్నారు. బీపీ, షుగర్, పల్స్, బీఎంఐలు తరచుగా పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ప్రతిరోజూ 7 నుంచి 9 గంటలు నిద్రపోవాలని, ధూమపానం, మద్యపానంకు దూరంగా ఉండాలన్నారు. చదరంగం, పజిల్స్, సూడోకో వంటి బ్రెయిన్ గేమ్స్ ఆడడం వల్ల బ్రెయిన్ డిజార్డర్స్ నివారించవచ్చు అని తెలిపారు. సామాజిక కార్యకలాపాల్లో చురుకుగా ఉండాలని, కుటుంబం, స్నేహితులతో సన్నిహితంగా ఉండాలని డాక్టర్ విజయ సూచించారు.

గురు పౌర్ణమి పురస్కారాలు అందజేత



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా

తెనాలిరూరల్: తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో రావినూతల సాంబశివరావు స్మారక మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలతో పాటు విద్యార్థులలో మ్యాథ్స్ విజ్ఞానం, సృజనాత్మకంగా ఆలోచించే వారికి బహుమతులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సేవలను అందించడం, ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సాహించటం, వివిధ రంగాలల్లో కృషి చేసిన వారికి విశిష్ట పురస్కారాలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచి ఉన్నత విద్యావంతుడి దశకు విద్యార్థులు వెళ్లినా, చదువు నేర్పిన గురువుల్ని, తల్లిదండ్రులను మర్చిపోకూడదని అన్నారు. రావినూతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావినూతల సాంబశివరావు శతజయంతిని పురస్కరించుకుని విజ్ఞాన పరంగా, టెక్నాలజీ పరంగా, గణిత పరంగా, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడం పట్ల నిర్వాహకుల్ని అభినందించారు. ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా అభినందించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శాఖమూరి నారాయణ ప్రసాద్ రావినూతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను గుర్తు చేసుకుని కొనియాడారు. గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, గ్రామ ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, గరికపాటి సుబ్బారావు, అబ్బరాజు తిమ్మరసు, ఆర్ ప్రకాష్ తదితరులు ప్రసంగించారు. ప్రతిభ కనబరిచిన 25 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, బహుమతులను అందజేయడంతో పాటు ఉపాధ్యాయులు లక్ష్మీఅన్నపూర్ణ, అల్లం వెంకట నారాయణ, పీవీఎస్ మహలక్ష్మి, అబ్దుల్ కరీంను సన్మానించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న స్వరలయ వ్యవస్థాపకులు లక్కరాజు సాయి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మధుబాబు, కళాకారులు వేమూరి విజయభాస్కర్, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, హరికథా భాగవతార్ రాధాకృష్ణమూర్తి పేరిట ఆయన కుమారుడు శ్రీనివాస్‌కు విశిష్ట పురస్కారాలు అందజేశారు. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయిని అనురాధ, గ్రామ ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, ఆర్.ప్రకాష్, శివప్రసాద్, రాజేష్ పర్యవేక్షించారు.

వరి వర్షార్పణం.. అన్నదాతకు అపార నష్టం



తెనాలి సమీపంలో పంట చేలలో నిలిచిన నీరు

తెనాలి: అధిక వర్షాలు మాగాణి రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. పల్లపు ప్రాంతాల్లోని మాగాణి వరిచేలు వర్షాల కారణంగా నీట మునిగాయి. వెదజల్లిన చేలల్లో వర్షపునీటి ముంపుతో వరి విత్తనాలు ఎందుకూ పనికిరాకుండాపోయాయి. రైతుల కష్టం, ఖర్చుచేసిన డబ్బులు నీటిపాలయ్యాయి. మరమ్మతులకు నోచుకోని డ్రెయిన్ల కారణంగా పంటపొలాల్లో నీరు తిష్ట వేసి, రైతులను నష్టాలపాలు చేసింది. ఖరీఫ్ సీజనులో అనుకూల పరిస్థితుల కారణంగా ఎక్కువశాతం జీరో టిల్లేజి సాగు జరుగుతున్న విషయం తెలిసిందే. వరి నారుమళ్లు పోసి నారు చేతికొచ్చాక నాట్లు వేసే పద్ధతికి చాలామంది రైతులు స్వస్తి పలికారు. వరి విత్తనాలను దుక్కిలో వెదజల్లుతున్నారు. దీనివల్ల రైతులకు ఖర్చులు కలిసొస్తున్నాయి. దిగుబడులు బాగానే వస్తుండటంతో ఈ విధానానికే రైతులు ఎక్కువమంది మొగ్గుచూపారు. ఈ క్రమంలో తెనాలి వ్యవసాయ సబ్ డివిజనులో ఇప్పటికే 39,425 ఎకరాల్లో వరి విత్తనాలను వెదజల్లారు.

2,225 ఎకరాల్లో పంట నష్టం

కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాల్లోని వరిచేలు నీటి ముంపుకు గురయ్యాయి. రోజుల తరబడి నీరు నిలిచిన చేలల్లో చల్లిన విత్తనాలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. తెనాలి వ్యవసాయ సబ్‌డివిజనులో తెనాలి మండలంలో 1,225 ఎకరాలు, కొల్లిపర మండలంలో 100 ఎకరాలు, దుగ్గిరాల మండలంలో 750 ఎకరాల్లో వెరసి మొత్తం 2,225 ఎకరాల్లో వరి చేలల్లో రైతులు నష్టపోయినట్టు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా. విత్తనాల ధరతో సహా రైతులు ఒక్కో ఎకరాకు దాదాపు రూ.8 వేల వరకు నష్టపోయారు.

కొత్త ప్రభుతం ఏర్పాటుతో జాప్యం

ఏటా వేసవి సీజనులో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనుల పేరుతో పంట కాల్వలు, మురుగుకాల్వల మరమ్మతులు చేపడుతుండటం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికలు, అనంతర ఫలితాలు, కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో ఈసారి జాప్యం చోటు చేసుకుంది. చేలకు సాగునీటిని సరఫరా చేసే పంట కాల్వలతో పాటు వర్షపునీటిని త్వరితగతిని బయటకు పంపే మురుగుకాల్వలూ కీలకం. ఆయా కాల్వలన్నీ తూటాకు, గుర్రపుడెక్కతో అల్లుకుపోయాయి. ఖరీఫ్ వ్యవసాయ పనులు ఆరంభమైన తర్వాత కూడా ఇరిగేషన్, డ్రైనేజీ శాఖలు మీనమేషాలు లెక్కిస్తూ టెండర్ల ఖరారుతోనే కాలయాపన చేశాయి. ఫలితంగా ముంపు చేలల్లోని నీరు రోజులతరబడి అక్కడే తిష్ట వేసుకుని ఉంది. రైతుల నష్టానికి ఇదొక కారణమని చెబుతున్నారు.

ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ శ్యాంసుందర్

నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్, ఎస్ఈ శ్యాం సుందర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు సోమవారం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులు రీ ఓపెన్ కాకుండా క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం సదరు ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు ఆన్‌లైన్‌లో జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజల నుంచి 42 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 12, ఇంజినీరింగ్ విభాగానికి 5, రెవెన్యూ విభాగానికి 5, ప్రజారోగ్య విభాగం 17, అకౌంట్స్ విభాగానికి 1, ఉపా సెల్ విభాగానికి, ఎన్నికల విభాగానికి ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, వెంకట లక్ష్మి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యతోనే పద్మశాలీయుల సమగ్రాభివృద్ధి

పద్మశాలీయ సంక్షేమ సంఘ నగర అధ్యక్షుడు చిన వీరయ్య



నోటు పుస్తకాలు అందజేస్తున్న చిన వీరయ్య, సూర్యనారాయణ, కోటేశ్వరరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతోనే పద్మశాలీయుల సమగ్రాభివృద్ధి సాధ్యమని పద్మశాలీయ సంక్షేమ సంఘ నగర అధ్యక్షుడు గుర్రం చిన వీరయ్య పేర్కొన్నారు. నగర పద్మశాలీయ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో సోమవారం గుజ్జనగుండ్లలోని ప్రగడ కోటయ్య చేనేత భవన్‌లో విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా చిన వీరయ్య మాట్లాడుతూ ఆదిమ మానవుడికి తన చేతి కళా నైపుణ్యంతో వస్త్రాలు అందించి నాగరిక మానవుడిగా తీర్చిదిద్దిన పద్మశాలీలు ఆధునిక యంత్రాల రాకతో కులవృత్తి దెబ్బతింటున్న నేపథ్యంలో ఉన్నత విద్యావంతులుగా ఎదగడం ద్వారానే సామాజిక, రాజకీయ, ఆర్థికంగా అందిపుచ్చుకుంటారని అన్నారు.

ఈ సందర్భంగా గోలి ద్రాక్షాయమ్మ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పది మంది విద్యార్థులకు రూ.రెండు వేల నగదు ప్రోత్సాహకాలతో పాటు టెన్త్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రతిభ చూపిన 20 మంది విద్యార్థులకు రూ.రెండు వేలు చొప్పున ప్రతిభా ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ జి.సూర్యనారాయణ, డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు, డాక్టర్ అందే వెంకటేశ్వరరావు, విద్యావేత్త మురుగుడు శ్రీహరి, విశ్రాంత బ్యాంకు ఉన్నతాధికారులు ఆకురాతి అమర్నాథ్, రామనాథం పరమేశ్వరరావు, కార్యంపూడి వాసుదేవరావు, సంఘం ప్రధాన కార్యదర్శి పడవల రఘురాం, గోలి వెంకటేశ్వరరావు, గోలి వెంకట సుబ్బారావు, యంగల శ్రీధర్, వెనిగళ్ల శ్రీనివాసరావు, మాచర్ల వీర రాఘవయ్య, చిలువేరు గణేష్, జొన్నాదుల సురేష్ బాబు, పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల సమస్యలపై వినతి



ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాల్యాద్రి

నెహ్రూనగర్: గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న అవుట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ గుంటూరు నగర ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి విన్నవించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో రోడ్లపై వేస్తున్న మస్తర్‌ను నిలుపుదల చేసి, శానిటరీ కార్యాలయాల వద్దనే మస్తర్లు వేయాలని, 62 సంవత్సరాలు పూర్తయి నిలుపుదల చేసిన, మరణించిన, అనారోగ్యంతో పనులు చేయలేకపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం పూర్తి సెలవు, ప్రభుత్వ జాతీయ సెలవులను పూర్తిగా అమలు చేయాలన్నారు. నగర జనాభా విస్తారంగా పెరుగుతున్న కారణంగా కార్మికుల సంఖ్యను కూడా పెంచాలని కోరారు. బదిలీ కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా పూర్తి స్థాయి కార్మికులుగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

పంటకాలువల్లో అడ్డంకులు సత్వరమే తొలగించాలి

సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశం



రైతులతో మాట్లాడుతున్న ప్రఖర్‌జైన్

తెనాలి: ఖరీఫ్ సీజనులో పంటసాగుకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు పంట కాల్వలన్నింటినీ వారం రోజుల్లోగా శుభ్రం చేయాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పంట కాల్వలను సోమవారం సాయంత్రం సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో మురుగు, గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలతో నిండిపోయిన పంట కాల్వలను పరిశీలించారు. చినరావూరు మురుగు కాలవ, పెదరావూరు, పెరవలి కాలువ, జంపని కాలువ, బుర్రిపాలెం రోడ్డులోని పంట కాల్వలను అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంట కాల్వలు గుర్రపుడెక్క, తూటాకు వ్యర్థాలతో నిండిపోవడం వల్ల వర్షపు నీరు పోయే మార్గం లేక పొలాల్లోనే నిలిచిపోయిందని, దీంతో తాము నష్టపోతున్నామని రైతులు తెలియజేశారు. సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ వారం రోజుల్లోపు పంటకాల్వల్లోని అవరోధాలను తొలగించాలని ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులను ఆదేశించారు. వీరితో మండల తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రేమ్ సాగర్, మండల డ్రైనేజీ అధికారి రాంబాబు, వీఐలు నీలవేణి, ఏంజెల్, కోకిల, గోపీనాథ్, రైతులు పాల్గొన్నారు.